# తులా "బీర" వ్రతం

ద్వాపరయుగంలో కళింగరాజ్యాన్ని పరిపాలించిన వీరసేనరాజు కొన్ని జన్మల తర్వాత సుమారు ఎనభైఏళ్ళ క్రితం ఒక సంస్థానాధిపతిగా జన్మించాడు. ఆయనకు పూర్వాపూర్వజన్మల వాసనలెప్పుడూ పోలేదు. అంచాత అన్ని పనులూ ద్వాపరయుగంలో ఎంత నియమంతో చేసేవాడో క్రీ. శ. పంతొమ్మిదో శతాబ్దంలోకూడా అంతనిష్ఠతో చేసేవాడు.

ఆయన దినచర్య ఇది: ఉదయం పూజ. మధ్యాహ్నం సంస్థాన పరిపాలనా కార్యక్రమాలు: సాయంకాలం కవితా గోష్ఠి. అప్పుడే మైరేయము త్రావుట.రాత్రి ఇష్ట స్త్రీలతో సల్లాపములు.

ఇలా కాలం సుఖంగానే గడిచిపోతున్నపట్టంలో ఒకసారి రాజుగారికి అకస్మాత్తుగా జబ్బుచేసింది. ఎందరో వైద్యులు రాజుగార్ని సందర్శించినా ఫలితం శూన్యం. సరియైన రోగనిదానం జరగడంలేదు మంచిమందు లోపలికి వెళ్ళడంలేదు. దేవేరులంతా చింతతో క్రుంగిపోతున్నారు.

ఒకరోజున రాజుగారికి ఒకకల వచ్చింది. ఆ కలలో నారదులవారు కనిపించి "రాజా! నీ జబ్బుత్వరలోనే పోతుంది. నే చెప్పినట్లు చెయ్యి. నీ ఎత్తు "బీర" తూకంవేసి ఇష్టజనులకు పంచిపెట్టు. ఒక పదిరోజులు సద్బ్రాహ్మణుల పాదాలు బీరుతో కడిగి ఆతీర్థం నెత్తిమీదచల్లుకో," అని చెప్పి తులా "బీర" వ్రతం గురించి తెలియచేశాడు.

రాజుగారు ఆ వ్రతాన్ని నిష్ఠతో ఆచరించి రుగ్మతను పోగొట్టుకున్నారు. ఆ తర్వాత ఆయనా, ఆయన పుత్రులూ, పౌత్రులూ అందరూకూడా అనేక బీరు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పి దేశసేవ చేశారు. అడిగిన వారికి ఎపుడూ వారి కుటుంబీకులు "బీరు" లేదనలేదు. వారు అంతటి దానశీలురు. వారి సంస్థానం మిగతాదేశంతో విలీనీకరణ జరిగేవరకు వారి జెండాపై 'సీసా' వుండేది.

ఇప్పటికికూడా బీరు విషయంలో ఆ వంశీకులు ఉదారంగానే ఉంటారు. తులా "బీర" వ్రతం యథాశక్తి ఆచరిస్తూ వుంటారు. తులా "బీర" వ్రతవిధానం పూర్తిగా తెలుసుకోగోరే వారికోసం కొన్నివేల కాపీలు అచ్చొత్తింప బడుతున్నాయి.

ఫలశ్రుతి: ఈ కథ చదివిన ప్రతిసారీ పాఠకుడికి ఒక బీరకాయ పుచ్చుకొన్నంత "సుఖం" కలుగుగాత! ✲

---

"గోపాలచక్రవర్తి"

---